ప్రజాశక్తి

సోమవారం 30, జనవరి 2022 5 శ్రీ సత్యసాయి

బంగారు పతకాన్ని సాధించిన హరీష

విలువిద్యలో 'పురం' విద్యార్థినికి బంగారు పతకం

ప్రజాశక్తి-హిందూపురం

మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జాతీయ స్థాయి విలువిద్య (ఆర్చరీ పోటీల్లో) పోటీల్లో హిందూపురం పట్టణానికి చెందిన కెపి. హరీష అండర్ 17 విభాగంలో ప్రతిభ కనబరచి బంగారు పతకం సాధించినట్లు కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు బోపాల్‌లో జరిగిన ఈ పోటీల్లో రాణించిన హరీష రాజస్థాన్ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మనిష్‌కుమార్ చేతుల మీదుగా బంగారుపతకం అందుకొన్నట్లు వివరించారు. పట్టణంలోని మెయిన్ బజారులో వాయిపుత్ర జువెలర్స్ నిర్వహుకులు కుంచం ఫణిరాజ్, సహన దంపతుల కుమార్తె హరీష ప్రస్తుతం బెంగళూరులోని న్యూ బాల ఇంటర్నేషనల్ స్కూల్ లో తొమ్మిదో తరగతి చదువుతోందన్నారు. హరీష ఆర్చరీలో జాతీయ స్థాయి పోటీల్లో బంగారుపతకం సాధించటంపై పట్టణానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

ముగిసిన అనంత బాలోత్సవం

ఆటలు, పాటలు, జానపద నాటికలు, కోలాటం, నృత్యాలు, సంగీతం, సాహిత్యం, వక్తృత్వం, వార్తా కథనం, మట్టి బొమ్మలు తదితర వాటితో చిన్నారుల అనంత బాలోత్సవం కనుల పండువగా, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మది మురిసిపోయేలా ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానం కళకళలాడింది. మూడు రోజుల పాటు ఉత్తేజ పూరితమైన వాతావరణంలో పిల్లల సృజనాత్మకత, సామాజిక చైతన్యం, సంస్కృతి, సంప్రదాయాలు మేళవింపుగా.. ఉత్తేజభరితంగా సాగిన అనంత బాలోత్సవాలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. పిల్లల ఉత్సాహానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల నైపుణ్యత కలగలసి పిల్లల పండుగ నిండుతనంగా కొనసాగింది. అతిథుల కరచాల ధ్వనుల నడుమ చిన్నారుల ప్రశంసల జల్లులు వెల్లువెత్తాయి. ఇంతటి చక్కటి వేదికను ఏర్పాటు చేసి పిల్లల్లో ఆనందాన్ని నింపిన అనంత బాలోత్సవం కమిటీ నిర్వాహకులకు, సహకరించిన అధికారులకు ప్రజల నుంచి అభినందలు వెల్లువెత్తాయి

ఉత్సాహం, ఉల్లాసంతో మెరిసిన చిన్నారులు

మురిసిపోయిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

కనులవిందుగా సాగిన కళా ప్రదర్శనలు

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విభిన్న కళల ఆవిష్కరణలు, ప్రదర్శన చతురత, కుటుంబ బాంధవ్యాలు, వృద్ధాప్య తల్లిదండ్రుల సంరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన, సమాజిక స్పృహ, ఒకటేమిటి చిన్నారులతో ఉత్తేజభరితంగా మూడు రోజుల పాటు సాగిన అనంత బాలోత్సవం ఆదివారం ముగిసింది. ఒకరిని మించి మరొకరు పోటా పోటీగా ప్రదర్శనలు, బృంద నృత్యాలు, జానపద నాటికలు, ఏకపాత్రాభినయం, విచిత్ర వేషధారణ, జాతీయ నేతల ధైర్య సాహసాలు, త్యాగం, గొప్ప వ్యక్తుల సేవాదృక్పథాలు, రైతుల స్థితిగతులు, పర్యావరణ పరిరక్షణకు మొక్కల సంరక్షణ, తీరకలేని దైనందిన జీవితంలో వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు, సాంకేతిక పరిజ్ఞానం మంచి కోసం వినియోగించాలంటూ పిల్లలు ప్రదర్శనలు న్యాయనిర్ణేతలకే ఆనందాన్ని పంచాయి.

చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

పిల్లల ఆసక్తిని గురించి ప్రోత్సహిద్దాం

అనంతపురం డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

పిల్లలకు ఇష్టంలేని చదువులు చదివించి వారిని బాధపెట్టి మనం బాధపడటం కన్నా వారికి పై చదువుల్లో సైన్స్, ఆర్ట్స్, ఇంజనీరింగ్, వృత్తివిద్య, వంటి వాటిలో ఏది ఇష్టమో వారి ఆసక్తిని గుర్తించి అటువైపు ప్రోత్సహించేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని అనంతపురం డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన అనంత బాలోత్సవాలు ముగిశాయి. పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతుల ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్రయాదవ్ ఆహ్వానితులుగా, అనంత బాలోత్సవ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి అధ్యక్షతన ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ శాశ్వత సభ్యులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, ప్రముఖ కంటి వైద్యులు అక్బర్ సాహెబ్, మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్ సిఐ కత్తి శ్రీనివాసులు, రవికాంత్ క్యాటర్స్ అధినేత రమణ, లలితకళాపరిషత్ అధ్యక్షులు వెంకట సుబ్బయ్య, కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది పద్మజ, నాట్యాచార్యులు పట్నం శివప్రసాద్, డాక్టర్ హేమలత, సాయి సంస్థ విజయకుమార్ తదితరులు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు ఆటలు, నైపుణ్య కళలు అవసరం అన్నారు. చదువులో రాణించకపోయినా ఆటలు, పాటలు, సంగీతం, వివిధ కళలతో ఆదర్శంగా నిలిచిన వారెందరో ఉన్నారని తెలిపారు. 130 కోట్ల జనాభా కలిగిన భారతదేశం కంటే కోటి మంది కూడా లేని ఇజ్రాయిల్ దేశంలో నొబెల్ బహుమతులు సాధిస్తున్నారంటే వారు చదువుకున్న వారు మాత్రమే కాదని అనేక కళలతో ప్రతిభ చాటుతున్నారని గుర్తు చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని డాక్టర్, ఇంజనీర్‌గా చూడాలన్న ఆశయాలను బలవంతంగా రుద్ది బాధపడే కన్నా వారికి నచ్చిన రంగాన్ని గుర్తించి అటువైపు ప్రోత్సహించాలని సూచించారు. ఆర్ట్స్ గ్రూపు చదువుకున్న వారే అత్యధికంగా అత్యున్నత స్థానాల్లో నిలిచారన్నారు. అనంత బాలోత్సవంలో పిల్లల సృజనాత్మకత చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. కేంద్ర అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల పాటు పిల్లలు టివీలు, సెల్‌ఫోన్‌లకు దూరమై అనంత బాలోత్సవంలో సృజనాత్మకత, తమ కళా ప్రదర్శనలతో అసలైన ఆనందాన్ని పొందడం సంతోషంగా ఉందన్నారు. పిల్లలు యాంత్రిక నాగరికతకు లోనవుతున్నారని తెలిపారు. టివి, సెల్‌ఫోన్, కంప్యూటర్ మంచి యాంత్రికరణలే అని, వాటిలో మంచిని మాత్రమే స్వీకరించి చెడుకు దూరంగా ఉండాలన్నారు. విద్యా కార్పొరేటీకరణ జరిగిన నేపథ్యంలో పిల్లలకు ఆటలు, పాటలు దూరమయ్యాయన్నారు. అనంత బాలోత్సవం ఆ లోటును భర్తీ చేసి పిల్లల్లో మంచి ఆలోచనలను పెంపొందించాయని తెలిపారు. అనంత బాలోత్సవ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫీవుల్లా మాట్లాడుతూ అనంత బాలోత్సవంలో పిల్లలు మూడు రోజుల పాటు ఎంతో ఆనందంగా తమ కళలు, ఆలోచనలు, ప్రదర్శనలు చేస్తూ గడపడం సంతోషంగా ఉందన్నారు. అనంత బాలోత్సవ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ అనంత బాలోత్సవం విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణయ్య, ఇతర అధికారులు, పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సహాయ సహకారాలు అందించిన దాతలు, నిర్వాహక కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రచయితలు కంబదూరి షేక్ నబీరసూల్, నానీల నాగేంద్ర, రియాజుద్దీన్, మధురశ్రీ, ఎల్ఆర్.రమణ, సాదుశేఖర్, అంకె శ్రీనివాసులు, అనంత బాలోత్సవ కమిటీ కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి జిలాన్, సభ్యులు కోటేశ్వరప్ప, రమణయ్య, నాగేంద్ర, లింగమయ్య, గోవిందరాజులు, సరళ, దేవేంద్రమ్మ, పరమేష్, గిరి, శివ, రిషి, రామాంజినమ్మ, హసీనా, చంద్రిక, సురేష్, రాము, నాగేంద్రకుమార్, రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, నాగమణి, క్రిష్ణమూర్తి, వెంకటనారాయణ, బాల రంగయ్య, నల్లప్ప, రాంభూపాల్, యోగా గురువు క్రిష్ణవేణి, మానవతా తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, వన్నూరు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్ని కృష్ణులతో నృత్యం చేస్తున్న గోపికలు

డాక్టర్ నానీల నాగేంద్రకు రాష్ట్రస్థాయి పురస్కారం

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీ కృష్ణదేవరాయ విద్యాలయం తెలుగు తులనాత్మక సాహిత్య శాఖలో అకాడమిక్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ నానీల నాగేంద్ర పిహెచ్‌డి సిద్ధాంత గ్రంథం రాష్ట్రస్థాయి కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారం-2023 కు ఎంపికయింది. నాగేంద్ర శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం పెడపల్లి గ్రామంలో ఈరమ్మ, చిన్న గరుడప్ప దంపతులకు జన్మించారు. దళిత కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదుగుతున్న నాగేంద్ర ఎందరికో ఆదర్శంగా నిలిచారు. అనంతపురం జిల్లా నుండి నానీల నాగేంద్రగా అందరికీ సుపరిచితుడు. జాతీయ అంతర్జాతీయ సెమినార్లలో పాల్గొని దాదాపు 50 పరిశోధనా పత్రాలను సమర్పించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖకు ప్రధాన కార్యదర్శిగా ఉంటూ నిరంతరం సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తూ చురుకైన పాత్రను నిర్వహిస్తున్నారు. ఈ పురస్కారం రావడం పట్ల ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రధాన ఆచార్యులు ఆచార్య జి.బాలసుబ్రమణ్యం, సౌరపు గోవిందరాజులు, బి.ఈశ్వర్‌రెడ్డి, పూజారి ఈరన్న, నందవరం కేశవరెడ్డి, కేంద్రీయ విశ్వవిద్యాలయం హైదరాబాద్ తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు తదితరులు నానీల నాగేంద్రను అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న నవీన్ నిశ్చల్

జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

హిందూపురం : ఫిబ్రవరి 16న జరిగే శ్రీకృష్ణదేవరాయలు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని ఎపి అగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో బలిజల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీకృష్ణదేవరాయల జయంతి ఉత్సవాలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా హాజరైన నవీన్ మాట్లాడుతు జయంతి నాటికి పట్టణంలో ఏర్పాటు చేస్తున్న శ్రీకృష్ణ దేరరాయల విగ్రహ ఏర్పాటు పనులు సైతం పూర్తి చేసి, విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిద్దామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో పార్టీలకు అతీతంగా బలీజలందరు పాల్గొని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల ఉమేష్, పెద్ద నాయకులు, బలిజ సోదరులు పాల్గొన్నారు.

కనిపించని జాబ్ క్యాలెండర్

నంబుల పూలకుంట : ప్రతి ఏడాది జనవరి నెలలో జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామన్న వైసిపి ప్రభుత్వం మాట తప్పిందని టిడిపి మండల నాయకులు దండే గంగశేఖర్ విమర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీలను విస్మరించారని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గుర్తుకొచ్చిన నిరుద్యోగ యువత గురించి ఇప్పుడు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి ఇంతవరకు ఒక్క కంపెనీని కూడా తీసుకొచ్చిన పాపాన పోలేదని ఎద్దేవా చేశారు. యువత కోసం లోకేష్ చేస్తున్న పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌కు సత్కారం

గోరంట్ల : గోరంట్ల పట్టణానికి చెందిన జీఎం శేఖర్ జాతీయ రెడ్ క్రాస్ సొసైటీ సత్యసాయి జిల్లా చైర్మన్‌గా ఇటీవల ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో పట్టణంలో జీఎం శేఖర్‌ను పలువురు ఆదివారం సన్మానించారు జీఎం శేఖర్ మరెన్నో పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

జ్వరాల బారిన గురుకుల పాఠశాల విద్యార్థులు

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం కాలసముద్రం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు జ్వరాల బారిన పడ్డారు. దీంతో విద్యార్థులు వైద్య పరీక్షలు నిమిత్తం కదిరి ఏరియా ఆసుపత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న డిఎంహెచ్ఓ ఐనొద్దీన్ స్పందించి మలేరియా సబ్ యూనిట్‌ను పాఠశాలకు పంపించి వైద్యపరీక్షలు నిర్వహించారు. సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వైద్యసిబ్బంది తెలిపారు.

క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం

హిందూపురం : రెండోసారి ఆలిండియా క్రిష్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన హిందూపురానికి చెందిన నాగేంద్రకుమార్‌ను స్థానిక సి అండ్ ఐజి మిషన్ కాంపౌండ్ చర్చిలో చర్చి డీకెన్ బోర్డు సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మార్టిన్, పాస్టర్ రెవరెండ్ స్టీపన్ రాజ్, కార్యదర్శి క్రిస్టఫర్, కోశాధికారి ఆదర్శకుమార్, సహాయ కార్యదర్శి విక్టర్ జాషువా, కోశాధికారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నాగేంద్రను సన్మానిస్తున్న నాయకులు

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

కార్మిక శాఖ అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి డిసిఎల్ రఘురాములు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు, ఫలాలు అందించడమే తమ లక్ష్యమని అనంతపురం జిల్లా కార్మిక శాఖ ఇన్‌ఛార్జి కమిషనర్ జి.రఘురాములు అన్నారు. జిల్లాలో కార్మికుల కోసం చేపడుతున్న చర్యలు, అందిస్తున్న సేవలపై ప్రజాశక్తితో ఆయన ముఖాముఖి ముచ్చటించారు. ఆ వివరాలు ఇలా..

ప్రశ్న : జిల్లాలో ఎన్ని పరిశ్రమలు ఉన్నాయి . కార్మికుల పరిస్థితి ఎలా ఉంది ?

జవాబు : జిల్లాలో 500 పైబడి పరిశ్రమలు ఉన్నాయి. కొన్ని పరిశ్రమలు మూత పడ్డాయి. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ఏదైనా సమస్య తలెత్తితే కార్మిక శాఖకు ఫిర్యాదు చేస్తారు. ఆ ఫిర్యాదు మేరకు తమ శాఖ అధికారులు పరిశీలించి సమస్య ఉందని తెలిస్తే సంబంధిత పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరిస్తాం. యజమాన్యం కార్మికులకు అన్యాయం చేస్తూ ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే న్యాయశాఖను ఆశ్రయించి కార్మికులకు న్యాయం జరిగేంత వరకు పని చేస్తాం.

ప్రశ్న : పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నారా?

జవాబు : జిల్లాలో పలు పరిశ్రమల్లో ప్రమాదం సంభవించిన మాట వాస్తవమే. ప్రమాదం సంభవించినది సంబంధిత యాజమాన్య నిర్వహణ లోపం, అజాగ్రత్త వల్లే అని నిరూపణ అయితే బాధిత కార్మికులకు పరిహారం ఇప్పించడం, ప్రభుత్వం నుంచి వారి కుటుంబాన్ని

ఆదుకోవడం వంటి చర్యలు చేపడుతున్నాం. యజమానులు పరిశ్రమ నిర్వహణకు అన్ని అనుమతులు తీసుకున్న తరువాతనే ఏర్పాటు చేస్తున్నారు. భద్రతా చర్యలు ఉంటేనే ప్రభుత్వం అనుమతి ఉంటుంది. మధ్యలో ఏదైనా ప్రమాదం ఏర్పడితే యాజమాన్యం బాధ్యత తీసుకోవాలి. బాధితుల పక్షాన తమ శాఖ పని చేస్తుంది.

ప్రశ్న : కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏమంటారు?

జవాబు : యజమాని పరిశ్రమ పెట్టినప్పుడు లాభాల్లో నడవాలి. పరిశ్రమలో పనిని బట్టి కార్మికులను నియమిస్తారు. చేరేటప్పుడే వేతనం ఎంత ఇస్తారో స్పష్టమైన హామీతోనే చేరుతున్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికులకు వారు ఇచ్చే వేతనాలు పెంపుదల చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో అది తూచా తప్పకుండా అమలవుతుంది. ప్రయివేటు పరిశ్రమల్లో మా అజమాయిషీ ఉండదు. వారి పనిని బట్టి యజమానులే వేతనాలు నిర్ణయిస్తారు. 10 మంది చేయాల్సిన పనిని ఐదుగురితో చేయించి ఇబ్బందులు పెడితే తప్పకుండా యాజమాన్యం తప్పే. అలాంటి ఫిర్యాదులు వస్తే పరిశీలన చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : కార్మికులను తొలగిస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటారు ?

జవాబు : యజమాని పరిశ్రమ మూత వేస్తున్నప్పుడు కార్మికులను తొలగిస్తే ఎవరూ ఏమీ చేయలేరు. పరిశ్రమ నిర్వహిస్తూనే ఎలాంటి తప్పు లేకుండా తొలగించారన్న ఫిర్యాదు చేస్తే పరిశీలించి కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తున్నాం. నిబంధనలు అతిక్రమించి ఏదైనా పొరపాట్లు చేశారన్న కారణంతో యాజమాన్యం కార్మికులను తొలగిస్తే కూడా ఏమీ చేయలేం. అలాంటి ఫిర్యాదులను పరిశీలన చేసి కార్మికుల తప్పిదం జరిగితే తిరిగి పనిలో చేర్చలేం.

ప్రశ్న : యాజమానులకు అధికారులు అనుకూలంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి..మీ సమాధానం ?

జవాబు : జిల్లాలో కొత్త పరిశ్రమలు రావాలి. అప్పుడే కొత్తగా కార్మికులకు పని లభిస్తుంది. పరిశ్రమలను ప్రభుత్వం స్వాగతిస్తోంది. సరళీకరణ విధానం కార్మిక చట్టాల్లో కూడా జరిగింది. ప్రభుత్వ పాలకులు చేసిన చట్టాలను అధికారులమైన తాము అమలుచేయాల్సిందే. వ్యాపారం అభివృద్ధి జరిగినప్పుడే కొత్త పరిశ్రమలు వస్తాయి. యజమానులకు తమ శాఖ ద్వారా ఇవ్వాల్సిన అన్ని అనుమతులూ ఇస్తాం. అంతమాత్రాన యజమానులకు అనుకూలంగా పనిచేసినట్టు కాదు కదా. విరివిగా ఉపాధి కల్పించడం ప్రభుత్వ లక్ష్యం. చిన్న చిన్న పొరపాట్లు యాజమాన్యం చేస్తే సరిచేసి సక్రమంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

ప్రశ్న : కార్మికుల సంక్షేమం అమలవుతోందా..?

జవాబు : భవన నిర్మాణ రంగ కార్మికులకు శాఖ తరుపున వివాహ ప్రోత్సాహకాలు, ప్రసూతి సహాయం, ప్రమాదం జరిగితే ఎక్స్‌గ్రేషియా తదితరాలు ఇస్తాం. సాధారణ మృతికి రూ.60 వేలు, దహన సంస్కారాలకు రూ.20 వేలు, ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.2 లక్షలు, అంగవైకల్యానికి రూ.2 లక్షలు ఇలా ప్రోత్సాహకాలు, సహాయక చర్యలు ఉన్నాయి. అయితే శాఖ నుంచి ఇచ్చే ప్రోత్సాహకాల కంటే రాష్ట్ర ప్రభుత్వం ఆయా కులాల వారీగా ఇస్తున్న సదుపాయాలు ఎక్కువగా ఉన్నాయి. లబ్ధిదారుడు ఎక్కడో ఒక శాఖ ద్వారా మాత్రమే తీసుకోవాలి. కార్మిక శాఖ కంటే విద్యా, వైద్యం, ప్రమాద బీమా రంగాల నుంచి అధిక ప్రోత్సాహం ఇస్తున్నప్పుడు అక్కడే తీసుకుంటున్నారు. మా శాఖ తరపున ఇవ్వాల్సినవి ఇతర శాఖలకు బదలాయింపు చేశారు. అనుమతులు కూడా ఆన్‌లైన్ మీసేవ ద్వారా పొందుతున్నారు. గతంలో పర్యవేక్షణ తమ శాఖ పరిధిలో ఉండేది. అనేక మార్పులు జరిగిన తరువాత ఇతర శాఖలకు కొన్ని బాధ్యతలు అప్పగించారు. సమిష్టిగా అందరూ కార్మికుల సంక్షేమానికే పనిచేస్తాం. చిన్న షాపులు, సంస్థలు సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుని నిర్వహించుకుంటున్నారు. ప్రభుత్వం కావాలని వెసులుబాటు కల్పించింది. వాటిని అందరూ పాటించాల్సిందే.

సంక్షేమబోర్డుని వెంటనే ఏర్పాటు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి -పెనుకొండ

సంక్షేమబోర్డుని వెంటనే ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం పెనుకొండ పట్టణంలో టాటా ఏసీ,407 కు సంబంధించిన స్టాండ్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, ట్రాన్స్‌పోర్టు రంగం జిల్లా ప్రధాన కార్యదర్శి పెడబల్లి బాబా పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రవాణా రంగంలో పనిచేసే 407, ఐచర్స్, మినీ లారీ, ఆటోమొబైల్ వాహనాలకు సంబంధించిన కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంకార్మికుల సంక్షేమ నిధిని వాడుకుని వారి నుంచి చలానా పేరుతో వేధించడం బాధాకరమన్నారు. పెరిగిన రోజువారీ సరుకుల ధరలు పెరగడంతో కార్మికుల కుటుంబపోషణ భారమైందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని రవాణా కార్మికుల కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచి, అమలు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే రవాణా కార్మికులకు ప్రత్యేకంగా సంక్షేమ సౌకర్యాలను అమలు చెయ్యటానికి బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. డ్రైవర్ల కుటుంబాలు కనీసం మంచి విద్య, వైద్యానికి కూడా నోచుకోలేకపోతున్నారన్నారు. యాదృచ్ఛికంగా, రోడ్డు సక్రమంగా లేక జరిగే ప్రమాదాల సందర్భంలో వీరిని హత్యానేరం కేసుల కింద అరెస్ట్ చేసి రోజుల తరబడి జైల్లో ఉంచుతున్నారన్నారు. కేరళలో లాగా ట్రాన్స్‌పోర్టుకార్మికులందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి బాబావలి, రైతు సంఘం ఉపాధ్యక్షులు హరి, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం కార్యదర్శి ఎంవి.రమణ, ట్రాన్స్‌పోర్టు రంగం నాయకులు వజ్రం నాగప్ప, రెడ్డప్ప, మున్సిపల్ యూనియన్ నాయకులు చిన్న వెంకటేష్, తిప్పన్న, 407 డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ నాయకులు బండి శ్రీనివాసులు, టెంపు సీనా, రఫిక్, ఎర్రచాంద్, ఫక్రుద్దీన్, ఫయాజ్, అంజి, శ్రీధర్, భాస్కర్, జబి, కలిపి మారుతితో పాటు 70 మంది డ్రైవర్లు, ఓనర్లు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇఎస్ వెంకటేష్

రోడ్డు ప్రమాదంలో 'బ్రిలియన్స్' కరస్పాండెంట్ మృతి

పెనుకొండ : పట్టణంలోని మడకశిర రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్రిలియన్స్ పాఠశాల కరస్పాండెంట్ తిమ్మారెడ్డి మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాలు... ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న బ్రిలియన్స్ స్కూల్ కరస్పాండెంట్ తిమ్మారెడ్డిని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తిమ్మారెడ్డికి తీవ్ర గాయాలు అయ్యాయి. అతనితో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు తిమ్మారెడ్డిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి ఆటోలో తరలించారు. అయితే తిమ్మారెడ్డి అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. బ్రిలియన్స్ పాఠశాల కరస్పాండెంట్ తిమ్మారెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న పలు పాఠశాలల కరస్పాండెంట్లు, తదితరులు ఆసుపత్రి వద్దకు చేరుకొని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ, సర్పంచి శ్రీనివాసులు, నాయకులు సూర్యనారాయణ, ప్రసాద్, త్రివేంద్ర నాయుడు, బాబుల్ రెడ్డి తదితరులు తిమ్మారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అదేవిధంగా ఘనగిరి జనచైతన్య వేదిక అధ్యక్షులు రాజశేఖరరెడ్డి, కార్యదర్శి ఇమ్రాన్,సాహితీ స్రవంతి కన్వీనర్ హరి తదితరులు తిమారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎమ్మెల్సీ తండ్రి మృతికి నివాళి

హిందూపురం : హిందూపురం నియోజక వర్గ వైసిపి ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ ఇక్బాల్ తండ్రి షేక్ గౌస్ సాహెబ్ (94) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న హిందూపురం నియోజకవర్గ వైసీపీ నాయకులుకొండూరు వేణుగోపాల్ రెడ్డితో పాటు ముఖ్య నాయకులు ఆదివారం కర్నూల్‌కు వెళ్లి గౌస్ సాహెబ్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

బాధితుడికి ఆర్థికసాయం

బత్తలపల్లి : మండలంలోని డి. చెర్లోపల్లి బెస్త ప్రసాదుకు చెందిన 25 గొర్రెలు రైలు ప్రమాదంలో మృతిచెందాయి. దీంతో జీవనోపాధిని కోల్పోయిన ప్రసాద్‌ను ఆదుకోవటానికి సత్యసాయి జిల్లా బెస్త సేవా సంఘం, ధర్మవరం బెస్త సేవా సంఘం నాయకులు ముందుకు వచ్చారు. ఈసందర్భంగా వారు ఆదివారం తమవంతు సాయంగా లక్ష రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా బెస్తప్రసాద్ మాట్లాడుతూ తనకు సాయం చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా బెస్త సేవా సంఘం అధ్యక్షులు జ్యోతి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సుధా నాగార్జున, కోశాధికారి బెస్త కృష్ణమూర్తి, ధర్మవరం బెస్త సంఘం అధ్యక్షులు దత్త శివ, జిల్లా సంఘం గౌరవ సలహాదారులు బెస్త చలపతి, సుధా రాజేష్, జీఆర్ రామ్మోహన్, జ్యోతి ప్రసాద్, సుధా వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణకు యత్నం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని పార్థసారధినగర్‌లో ఇళ్లు నిర్మించేందుకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి రహదారిని ఆక్రమించేందుకు ఓ ఇంటి యజమాని ప్రయత్నించాడు. దీంతో కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు, ఫారెస్టు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ కమిషనర్ సిబ్బందిని సంఘటనాస్థలానికి పంపి పనులను నిలిపివేయించారు. స్థలంపై ఏవైనా సందేహాలు ఉంటే తిరిగి రీసర్వేచేయించుకోవాలని కమిషనర్ సూచించారు. పట్టణంలో ఎవరైనా ప్రభుత్వస్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

వివాదాస్పదంగా భూసమస్య

రొద్దం : మండలంలోని కంచెసముద్రం గ్రామంలో భూమి సమస్యపై వివాదం నెలకొంది. లోచర్ల గ్రామానికి చెందిన బోయ నాగలక్ష్మి తనకు ఉన్న 2.73 ఎకరాల భూమిలో ముళ్ల కంపలు తొలగించడానికి వెళ్లగా కంచెసముద్రం గ్రామస్తులు అడ్డుకొన్నారు. నాగలక్ష్మి కంచెసముద్రం గ్రామ సమీపంలో స్మశానం పక్కనే 82.2 సర్వే నంబర్లో 2-15 ఎకరాలు, 83.3 సర్వే నంబర్లో 0.58 ఎకరాలను మొత్తం 2.73 ఎకరాల భూమిని ప్రభుత్వం భూపంపిణీలో భూమిని పంపిణీ చేసింది. అయితే ఆభూమి సమీపంలోనే 7ఎకరాలకు పైగా భూమిని ప్రభుత్వం శ్మశానానికి కేటాయించింది. ఈ నేపథ్యంలో నాగలక్ష్మి తనకు ఇచ్చిన భూమిని కొలతలు వేయించుకోవటానికి అధికారుల సూచనల మేరకు కంపచెట్లను తొలగించే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టింది. అయితే శ్మశానభూమిలో చెట్లను తొలగించే కార్యక్రమం చేపడుతుందనే ఉద్దేశ్యంతో ఆ గ్రామస్తులు అడ్డుకున్నారు. భూ ఆక్రమణపై సోమవారం తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు ఈసందర్భంగా తెలిపారు.

పనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

సమావేశమైన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గోరంట్ల : మండలంలోని బూదిలి గ్రామ పభుత్వ ఉన్నత పాఠశాలలో 1980 - 81 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. తమ బాల్యమిత్రుడు ప్రకాష్ బాబు తన పెద్ద కుమారుడి వివాహ వేడుకల సందర్భంగా సమావేశమై అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సుమారు 42 సంవత్సరాల క్రితం పదో తరగతి చదివిన విద్యార్థులు ఇప్పుడు ఒకే వేదికపై ఇలా కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని వారు తెలిపారు.

శాప్ ఆధ్వర్యంలో ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్ష

ధర్మవరం : కేంద్రప్రభుత్వం నిర్వహిస్తున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ మాదిరి పరీక్షను స్కూల్ అసిస్టెంట్ అసోషియేషన్ సహకారంతో ఆదివారం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ బిఎస్ఆర్ బాలికల ఉన్నతపాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు ఈ మాదిరి పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలలో 120 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉమాపతి, స్కూల్ అసిస్టెంట్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు అన్నం సుధాకర్, ఉపాధ్యక్షులు సత్యమయ్య, రాష్ట్ర కౌన్సిలర్ ఉమామహేశ్వరప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, ఉపాధ్యాయులు రామకృష్ణనాయక్, మాధవ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి విరాళం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని దుర్గానగర్ రామాలయం, శివాలయాలలో జరుగుతున్న అభివృద్ధి పనులకు మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ విరాళం అందజేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ.50వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీసభ్యులు గోనుగుంట్ల సూర్యనారాయణకు కృతజ్ఞతలు తెలియజేశారు.

విరాళం అందజేస్తున్న 'గోనుగుంట్ల'

నేడు కల్యాణోత్సవం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని మార్కెండేయ స్వామి ఆలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు భద్రావతి భావన రుషీంద్రుల కల్యాణమహోత్సవాలు నిర్వహించనున్నట్టు పద్మశాలీయ బహుత్తమ సంఘం అధ్యక్షులు జక్కా చిన్న సింగరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మూడవ రోజు డోలికోత్సవం కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని స్పందన ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్, స్క్రీనింగ్ పరీక్షల వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. స్థానిక లక్ష్మీచెన్నకేశవపురంలోని మున్సిపల్ పాఠశాలలో నిర్వహించిన ఈ శిబిరంలో 56 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పందన ఆస్పత్రి వైద్యులు సోనియా, బషీర్, సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని ఎస్వీఆర్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో పుట్టపర్తి ఆల్ట్రావిజన్ ఐ కేర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు 150 మందికి వైద్య పరీక్షల నిర్వహించినట్లు ఆసుపత్రి నిర్వాహకులు నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామలింగనాయుడు, ఎస్ఆర్ఆర్ ఆసుపత్రి వైద్యులు,ఆల్ట్రావిజన్ కంటి వైద్య శాల నిర్వహకులు ముదిగుబ్బ నారాయణ స్వామి, కంటి వైద్యులు శ్రీనివాసులు, సిబ్బంది నాగరాజు, ఆల్ట్రావిజన్ కంటి ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

కనగాన పల్లి : మండల పరిధిలోని దాదులూరు కొట్టాల గ్రామంలో సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా రథోత్సవం

లేపాక్షి : మండలం పరిధిలోని సిరివరం గ్రామంలో కోడి రంగనాథ స్వామి రథత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగాఉదయం నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌ను గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నేత్రవతి, శ్రీనివాసులు, మంజునాథ్, క్రిష్టప్ప, ఆలయ అర్చకులు, ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దాతలకు సన్మానం

లేపాక్షి : మండలం కేంద్రంలోనివీరభద్ర స్వామి దేవాలయానికి కర్నాటక ప్రాంతానికి చెందిన దాతలు వెండి ఆభరణాలను అందజేశారు. తుంకూరు జిల్లా సిరా గ్రామానికి చెందిన సిద్ధ గంగమ్మ కుటుంబం ఈ వెండి ఆభరణాలను అందజేశారు. దీంతో దాతలను ఆలయ సాంప్రదాయం ప్రకారం ఆలయ కార్య నిర్వాహణాధికారి ఎం.హెచ్ నరసింహమూర్తి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసులు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

శివాజీ జయంతిని విజయవంతం చేయండి

పరిగి : ఫిబ్రవరి 26న నిర్వహించే చత్రపతి శివాజీ జయంతిని విజయవంతం చేయాలని శివాజీ సేవా ట్రస్ట్ సభ్యులు కోరారు. ఈ మేరకు వారు ఆదివారం పరిగి మండల కేంద్రంలోని బీరలింగేశ్వర స్వామి కళ్యాణ మండపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చేనెల 26న హిందూపురంలో ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించే సందర్భంగా కార్యాచరణ కోసమై పరిగి మండలంలో సమావేశం నిర్వహించామన్నారు. మండలానికి సంబంధించిన 14 పంచాయతీల నుంచి పార్టీలకు, కులాలకు అతీతంగా గ్రామ పెద్దలు,యువకులు పెద్ద ఎత్తున ఈ ఉత్సవాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ సేవా ట్రస్ట్ అధ్యక్షులు కెవి.చలపతి, ఉపాధ్యక్షులు మేడికుర్తి హరి, కృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శి రమేశ్ రెడ్డి, కార్యదర్శి జయరామ్, బెస్త మనోహర్, కోశాధికారి బంగారు చంద్ర, సంయుక్త కార్యదర్శి జగదీష్, రామాంజి, సమితి సభ్యులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ధర్మవరం టౌన్ : పట్టణంలోని శాంతినగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. కిమ్స్ సవేరా ఆస్పత్రి సహకారంతో 4వ వార్డు కౌన్సిలర్ జేసీబీరమణ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సవేరా ఆస్పత్రి వైద్యులు నాగరాజు, ఏరియా మేనేజర్ షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని శ్రీపేట వెంకటరమణ స్వామి ఆలయానికి చెందిన పెద్ద తేరు మరమ్మతుకు ఎపి అగ్రో చైర్మన్ బి నవీన్ నిశ్చల్ లక్షరూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఇందులో భాగంగా ఆదివారం రూ.50వేలు అందించి, పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. మిగిలిన రూ.50వేలు పనులు ప్రారంభం అయిన వెంటనే అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంహెచ్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు తప్పనిసరి

పెనుకొండ : వాహన చోదకులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ రమేష్ బాబు సూచించారు. పట్టణంలో టాటా ఏసీ,407 కు సంబంధించిన స్టాండ్లను ఎస్ఐ రమేష్ బాబు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, ట్రాన్స్‌పోర్టు రంగం జిల్లా ప్రధాన కార్యదర్శి పెడబల్లి బాబా, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, జిల్లా కమిటీ సభ్యులు ఫకృద్దీన్, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి బాబావలి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, నగరపంచాయతీ కార్మికుల యూనియన్ కార్యదర్శి చిన్ని వెంకటేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ డ్రైవర్లు తమ కుటుంబం తోపాటు ఎదుటి వారి కుటుంబ సభ్యులను గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం ఎస్ఐను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్టు రంగం జిల్లా నాయకులు వజ్రం నాగప్ప, రెడ్డప్ప ,407 డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ నాయకులు బండి శ్రీనివాసులు, టెంపు సీనా, రఫిక్, కలిపి మారుతి, రామాంజి, భాస్కర్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రను విజయవంతం చేద్దాం : టిడిపి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రను విజయవంతం చేద్దామని టిడిపి నాయకులు అన్నారు. ఈ మేరకు టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆదివారం హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమ్మినేని కేశవ నాయుడు, బేకరీ నాయుడు, క్రిష్టప్ప, రాఘవేంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా లోకేష్ యువగళం పాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు పాదయాత్రలో పాల్గొంటామని నాయకలు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు రాష్ట్ర కార్యదర్శి నరేష్ యాదవ్, నవీన్, శ్రీకాంత్, కార్తీక్, భరత్, రఘు, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వారధిలా పనిచేస్తాం

ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి

ఎమ్మెల్సీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వానికి ఉపాధ్యాయులకు మధ్య కొంత గ్యాప్ వచ్చిందని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో మాట్లాడతామని, ఇద్దరి మధ్య వారధిలా పనిచేస్తామని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి పేర్కొన్నారు. ఆమెకు ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆత్మీయ సన్మాన సమావేశాన్ని పట్టణంలోని బాలయేసు కళాశాలలో ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ఆమెతో నాయకులు రామచంద్రారెడ్డి, రవీంద్రారెడ్డి తదితరులు హాజరయ్యారు. సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి గత 19 నెలల నుంచి తాను అనేక ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగానే ఎంఇఒ పోస్టులు భర్తీ చేస్తున్నారని, కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపచేసేలా త్వరలో జీవో వస్తుందని వివరించారు. ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. 1998 డీఎస్సీ ఉపాధ్యాయులకు త్వరలో పాఠశాలల్లో నియమించేలా చర్యలు తీసుకుంటున్నట్లు అన్నారు. సమావేశానంతరం కల్పలతారెడ్డిని మహిళా ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. 1998 డీఎస్సీ అభ్యర్థులు ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బలరాం రెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రంగధాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ నాయకులు వేణుగోపాల్, రీయాజ్ తదితరులు పాల్గొన్నారు.

అంధుల మార్గదర్శకుడు లూయిస్ బ్రెయిలీ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

అంధులకు స్ఫూర్తిదాయకుడిగా లూయిస్ బ్రెయిలీ నిలిచాడని అంధుల రాష్ట్ర సంఘం కార్యదర్శి జలంధర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లాలోని అంధులు స్థానిక సాయి ఆరామంలో సమావేశమై లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ అంధులు ఆత్మస్థైర్యంతో ముందుకు నడవాలని ప్రభుత్వం కల్పించిన సదుపాయాలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు షఫీ, ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు నాగరాజు, సత్యసాయి జిల్లా అధ్యక్షులు ఎంకె రామాంజనేయులు, నాయకులు హరినాథ్ రెడ్డి, క్రిష్టప్ప, గంగన్న, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు

శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే, తదితరులు

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని కటారుపల్లి సచివాలయ పరిధిలోని రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆర్‌బికెను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి అంజనప్ప, ఏవో లక్ష్మీప్రియ, ఎంపీపీ జగన్మోహన్, వైసీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ గంగోజమ్మ సర్పంచు రవీంద్ర నాయక్, ఆర్‌బికె చైర్మన్ శంకర నాయుడు, నాయకులు భాస్కర్ రెడ్డి, ఉత్తన్న, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జాబిలి'కి భాషా సేవా పురస్కారం

ప్రజాశక్తి - పెనుకొండ

అనంతపురం రెవెన్యూభవన్ లో జరిగిన రాష్ట్రభాషోపాధ్యాయ సంస్థ వేడుకలలో జాబిలి చాంద్‌బాషాను భాషా సేవాపురస్కారంతో సత్కరించారు. ఈ పురస్కారాన్ని రాష్ట్రభాషోపాధ్యా అధ్యక్షులు అంకాల కొండయ్య, ఒంటేరు శ్రీనివాస రెడ్డి తదితర రాష్ట్ర,జిల్లా నాయకుల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ పురస్కారం రావటం చాలా అభినందనీయమని శ్రీసత్యసాయి జిల్లా రచయిత సంఘం ప్రధాన కార్య దదర్శి డాక్టర్ శివన్న, చైర్మన్ భాస్కర్ నాయుడు, కోశాధికారి శివన్న, జయసింహ, ఉపేంద్ర శంకర రాజు, ఉపాధ్యాయసంఘ నాయకులు కోడూరు శ్రీనివాసులు, యుటిఎఫ్ సుధాకర్, వైఎస్ఆర్‌టిఎఫ్ శ్రీనివాసులు తదితరులు అభినందనలు తెలిపారు.

జాబిలిని సన్మానిస్తున్న దృశ్యం

మహిళల హక్కుల కోసం పోరాటం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

మహిళల సాధికారిత, హక్కులు సాధనకు పోరాటం చేయాల్సిందేనని మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని పేర్కొన్నారు. ఆదివారం పట్టణ సమీపంలోని గణేష్ కూడలిలో ఉన్న షాదీమహల్‌లో మహిళా సమైక్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల హక్కులు, సాధికారిక కోసం మహిళా సమాఖ్యకు అనేక పోరాటాలు చేసిన ఘనత ఉందన్నారు. బ్రిటిష్ పాలనలోనే సమాఖ్య స్థాపించి, బాల్య వివాహాలు, అంటరానితనం, మహిళలకు ఓటు హక్కు కోసం పోరాటాలు జరిగాయని చెప్పారు. గ్రహించ చట్టం 33 శాతం మహిళా రిజర్వేషన్లు పోరాటాల వల్లే సాధ్యమైందన్నారు. అరుణ రాయ్ పోరాటం వల్ల ఉపాధి హామీ పథకం మహిళలకు చోటు దక్కిందన్నారు. సమాచార హక్కు మహిళల హింస నిరోధక చట్టం పోరాటం వల్లే దక్కాయన్నారు. 25 సంవత్సరాలు మద్యాన్ని తాకట్టు పెట్టి అప్పు తెచ్చిన ఘనత జగన్ కే దక్కిందన్నారు. మద్యనిషేధం కోసం మరో పోరాటానికి మహిళలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మావతి, జిల్లా సిపిఐ, ఎఐటిసి కార్యదర్శులు వేమయ్య యాదవ్, బయన్న, నాయకులు వెంకటనారాయణ, కుళ్లాయప్ప, జయలక్ష్మి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాభవాని

బ్రహ్మోత్సవాలు ముంచుకొస్తున్నా పట్టని కోనేరు అభివృద్ధి

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు ముంచుకొస్తున్నా కోనేరు అభివృద్ధి పాలకులకు అధికారులకు పట్టలేదని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ విమర్శించారు. ఈ మేరకు జనసేన నాయకులు ఖాద్రి లక్ష్మి నరసింహ స్వామి కోనేరు, ఆలయ పరిసరాలను ఆదివారం పరిశీలించారు. సందర్భంగా భైరవ ప్రసాద్ మాట్లాడుతూ అతి పవిత్రంగా భావించే కోనేరు అధ్వానంగా తయారైందన్నారు. ఆలయ సమస్యల పరిష్కారం విషయంలో అధికారుల్లో చలనం లేదని విమర్శించారు. త్వరలో బ్రహ్మోత్సవాలు మొదలవుతున్నా కోనేరు అభివృద్ధి గురించి కాని, భక్తులకు సౌకర్యాలు కానీ కల్పించడంలో గాని అటు ఎమ్మెల్యే, ఇటు పాలకమండలి ఎలాంటి చర్యలు చేపట్టకపోవటం దారుణమన్నారు. ఇలానే ప్రవర్తిస్తే జనసేనపార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఆపార్టీ పట్టణ అధ్యక్షులు చలపతి, జిల్లా కార్యక్రమాల నిర్వహణ కమిటీ సభ్యులు లక్ష్మణ్, మహేష్, లోకేష్, అంజిబాబు, ప్రతాప్, వాల్మీకి హరీష్, హరిబాబు, రాజశేఖర్, నాగమణి, రెడ్డమ్మ, చక్రధర్, చక్రి, నవీన్ పాల్గొన్నారు.

కోనేరును పరిశీలిస్తున్న నాయకులు

CHANGE OF NAME

I submit that lam the **HDFC Policy of No.11514446** My name has been entered as **Ramappa.S** but my name has been entered as **S.Ramu S/o S.Aswatha Narayana rao** in the **Adhar No.342494534364** and Bank pass Book I sign with this name **S.Ramu** presently by and future.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు,కదిరి

O.S.NO:378/2019.

Between:
నంగి పురుషోత్తంరెడ్డి S/o ఆదినారాయణరెడ్డి,
లక్కసముద్రం గ్రామం, తలుపుల మండలం ...వాది
మరియు
యర్రిసాని విశ్వనాథరెడ్డి మరియు ఇతరులు ... ప్రతివాదులు

To:
D3: యర్రిసాని కళ్యాణి D/o Y. విశ్వనాథరెడ్డి, పల్లెవాండ్లపల్లి H/o బండ్లపల్లి తలుపుల మండలం.
D4: యర్రిసాని వీరారెడ్డి S/o Y. విశ్వనాథరెడ్డి, పల్లెవాండ్లపల్లి H/o బండ్లపల్లి తలుపుల మండలం.

3,4వ ప్రతివాదులకు సమన్లు

పై దావాలో పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తమై 22-02-2023 వ తేదికి వాయిదా వేసినారు. కావున మీరు 22-02-2023 వ తేదిన ఉదయ 10:30 గంటలకు మీరు స్వయముగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కాని పక్షములో పై కోర్టు వారు పై దావాను మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది: 22/02/2023
స్థలం:కదిరి

ఎ.చంద్రశేఖర్ రెడ్డి, బి.ఎ.,బి.ఎల్
వాదితరుపు వకీలు, కదిరి